తలవంచి ఎరగడే..

తమిళ అగ్రకథానాయకుడు ధనుష్ స్వీయదర్శకత్వంలో నటిస్తున్న చిత్రం 'రాయన్'. ఇది ఆయన 50వ చిత్రం కావడం విశేషం. సందీప్‌కిషన్ ఇందులో కీలక పాత్ర పోషిస్తున్నారు. సన్ పిక్చర్స్ నిర్మిస్తున్న ఈ పాన్‌ఇండియా చిత్రం జూన్ 13న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ప్రమోషన్‌లో భాగంగా ఈ సినిమాకు సంబంధించిన తొలిపాటను శుక్రవారం మేకర్స్ విడుదల చేశారు. 'తలవంచి ఎరగడే..' అంటూ సాగే ఈ పాటను చంద్రబోస్ రాయగా, ఏ.ఆర్.రెహమాన్ స్వరపరిచారు. శరత్‌సంతోష్ ఆలపించారు. ధనుష్ ఓ ఉత్సవంలో కొందరు గ్రామస్థులతో కలిసి మాస్ డాన్స్ చేస్తూ ఈ పాటలో కనిపించారు. రెహమాన్ సంగీతానికి ప్రభుదేవా కొరియోగ్రఫీ తోడవ్వడం వల్ల ఈ పాట కొత్త అందాన్ని సంతరించుకుందని, మాస్‌తో పాటు అన్ని వర్గాలకూ నచ్చే సినిమా ఇదని మేకర్స్ తెలిపారు. ఎస్.జె.సూర్య, సెల్వరాఘవన్, అపర్ణ బాలమురళి, ధుషార విజయన్ ఇతర ముఖ్యపాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: ఓం ప్రకాశ్.

అది అంత సౌకర్యంగా ఉండదు!

టాలీవుడ్‌లో వరుస విజయాల నందుకుని స్టార్‌హీరోయిన్‌గా ఎదిగింది సంయుక్త మీనన్. ప్రస్తుతం మాతృభాష మలయాళంలో కూడా వరివిగా సినిమాలు చేస్తూ బిజీగా ఉన్నది సంయుక్త. బహు భాషల్లో నటిస్తున్నావు కదా? ఏ భాషలో నటించడం సౌకర్యంగా ఉంటుంది? అనే ప్రశ్న ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఈ అందాల బొమ్మకు ఎదురైంది. దీనికి సంయుక్త తనదైన శైలిలో సమాధానమిచ్చింది. 'నాకు నటించడం ఇష్టం. భాష ఏదైనా ఎంజాయ్ చేస్తూ నటిస్తాను. అయితే.. సౌకర్యం అంటున్నారు కాబట్టి, మాతృభాషలో ఉన్నంత సౌకర్యం మిగతా భాషల్లో నటించేటప్పుడు ఉండదుకదా.. పైగా మలయాళంలో మేకప్ కూడా లైట్‌గా వేస్తారు. ఇక్కడ నేచురల్‌గా కనిపించాలి, నేచురల్‌గా నటించాలి. టాలీవుడ్ అలా కాదు, అక్కడ మేకప్ ఎక్కువ ఉంటుంది. యాక్టింగ్ డిఫరెంట్‌గా ఉంటుంది. షాట్ చేస్తున్నప్పుడు కూడా ఎప్పటికప్పుడు మేకప్ చెక్ చేసుకోవాలి. చర్మంపై ఏదో ఉన్నట్టు అనిపిస్తుంటుంది. అది కాస్త అసౌకర్యమేకదా.' అని చెప్పుకొచ్చింది సంయుక్త.

హీరోయిన్ సాయిపల్లవి పుట్టినరోజు వేడుక 'తండేల్' సెట్‌లో ఘనంగా జరిగింది. నిర్మాత అల్లు అరవింద్, చిత్ర కథానాయకుడు నాగచైతన్య, దర్శకుడు చందూ మొండేటితోపాటు యూనిట్ సభ్యులంతా ఈ వేడుకలో భాగం అయ్యారు. సాయిపల్లవితో లొకేషన్‌లో బర్త్‌డే కేక్ కట్ చేయించి అందరూ శుభాకాంక్షలు తెలిపారు. ప్రతిష్టాత్మక గీతాఆర్ట్స్ పతాకంపై ఈ సినిమా రూపొందుతున్న విషయం తెలిసిందే.

రామ్‌కి అగ్నిపరీక్ష?

ప్రస్తుతం పూరీ జగన్నాథ్ దర్శకత్వంలో 'డబుల్ ఇస్మార్ట్' చిత్రం చేస్తూ బిజీగా ఉన్నారు హీరో రామ్. ఈ సినిమా నిర్మాణం తుది దశకు చేరుకున్నట్టు తెలుస్తున్నది. ఇక తన తదుపరి సినిమా కోసం గౌతమ్ మీనన్ కథను ఇప్పటికే రామ్ ఓకే చేశారు.'డబుల్ ఇస్మార్ట్' తర్వాత తను చేసేది ఈ సినిమానే అనే వార్తలు కూడా బలంగా వినిపించాయి. అయితే.. ఇప్పుడు అనుకోకుండా త్రివిక్రమ్ ఎంటరయ్యారు. ప్రస్తుతం రామ్ కోసం మంచి కథను వండే పనిలో ఉన్నారట త్రివిక్రమ్. ఆయన దర్శకత్వం వహించే నెక్ట్స్ సినిమా ఇదేనని ఫిల్మ్‌వర్గాలు చెబుతున్నాయి. మహేశ్ 'గుంటూరు కారం' తర్వాత త్రివిక్రమ్ సినిమా బన్నీతో ఉంటుందని గతంలో వార్తలొచ్చాయి. అయితే.. అల్లు అర్జున్-అట్లీ కాంబినేషన్ దాదాపుగా ఖరారైపోయింది. దర్శకుడు అట్లీ చెప్పిన కథ నచ్చడంతో 'పుష్ప-2' తర్వాత అట్లీ సినిమానే పట్టాలెక్కించేందుకు బన్నీ సిద్ధమయ్యారు. దాంతో ఇప్పుడు త్రివిక్రమ్‌కి హీరోల సమస్య వచ్చిపడింది. పనిలోపనిగా మాతృ సంస్థ స్రవంతి మూవీస్ రుణం తీర్చుకునే అవకాశం కూడా వచ్చింది. అందుకే రామ్ కోసం ఓ మంచి క్యూట్ లవ్‌స్టోరీని సిద్ధం చేస్తున్నారు త్రివిక్రమ్. మరి రామ్.. గౌతమ్‌మీనన్ కథను హోల్డ్‌లో పెట్టి త్రివిక్రమ్ సినిమా చేస్తాడా? లేక గౌతమ్‌మీనన్‌కి ఇచ్చిన మాటకోసం త్రివిక్రమ్ సినిమాను పక్కనపెట్టేస్తాడా?. ఈ ప్రశ్నలకు సమాధానాలు రావాలంటే ఇంకొన్ని రోజులు ఆగాల్సిందే.

నమ్మకం నిజమైంది

ఇటీవల విడుదలైన తమిళ చిత్రం 'అరాణ్మనై 4' (తెలుగులో 'బాక్') తన కెరీర్‌కు కొత్త ఉత్సాహాన్నిచ్చిందని, ఈ ఏడాది తొలి విజయం దక్కిందని ఆనందం వ్యక్తం చేసింది అందాలభామ రాశీఖన్నా. సుందర్ సి. దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం ఇటీవలే విడుదలై మంచి విజయాన్ని దక్కించుకుంది. ఈ సందర్భంగా రాశీఖన్నా మాట్లాడుతూ 'ఈ సినిమాలో నేను పోషించిన డాక్టర్ మాయ పాత్రకు మంచి ప్రశంసలు దక్కుతున్నాయి. ఈ కథ విన్నప్పుడే సినిమా విజయం తథ్యమని భావించా. ఇక నా పాత్ర కథాగమనంలో కీలకంగా ఉందని అంటున్నారు. ఇప్పటికీ థియేటర్లు హౌస్‌ఫుల్ అవుతున్నాయి. ఈ సినిమా విషయంలో నా నమ్మకాలు నిజయ్యాయి. దక్షిణాదిలో ఈ ఏడాది మరిన్ని సినిమాలు చేయడానికి 'అరణ్మనై 4' విజయం స్ఫూర్తినిచ్చింది' అని చెప్పింది. ప్రస్తుతం ఈ భామ హిందీలో 'ది సబర్మతి రిపోర్ట్' 'టీఎమ్ఈ' చిత్రాలతో పాటు తెలుగులో 'తెలుసుకదా' అనే సినిమాలో నటిస్తున్నది

మర్డర్ మిస్టరీ నేపథ్యంలో..

అరవింద్ కృష్ణ, రజత్ రాఘవ ప్రధానపాత్రధారులుగా రూపొందుతోన్న చిత్రం 'సిట్'. 'స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్' అనేది ఉపశీర్షిక. నటాషా దోషి కథానాయిక. విజయభాస్కర్‌రెడ్డి(వీబీఆర్) దర్శకుడు. నాగిరెడ్డి, తేజ్ పల్లి, గుంటక శ్రీనివాస్‌రెడ్డి నిర్మాతలు. ప్రస్తుతం ఈ సినిమా నిర్మాణదశలో ఉంది. ప్రమోషన్‌లో భాగంగా ట్రైలర్‌ని యువహీరో విశ్వక్‌సేన్ విడుదల చేశారు. ట్రైలర్ చాలా బావుందని చిత్రబృందాన్ని ఆయన అభినందించారు. మర్డర్ ఇన్వెస్టిగేషన్ నేపథ్యంతో కూడిన కథాంశంతో ఈ సినిమా రూపొందుతున్నట్టు ట్రైలర్ చెబుతున్నది. అరవింద్ కృష్ణ ఇందులో శక్తివంతమైన పోలీస్‌అధికారిగా, రజత్‌రాఘవ కీలకపాత్రలో నటిస్తున్నారని, ఉత్కంఠను రేకెత్తించే కథాకథనాలతో సినిమా ఉంటుందని మేకర్స్ తెలిపారు. రుచిత సాదినేని, అనిల్ రాథోడ్, కౌశిక్ మేకల తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: జగదీశ్ బొమ్మిశెట్టి, సంగీతం: వరికుప్పల యాదగిరి.

యువత రాజకీయాల్లోకి రావాలి

జై సిద్ధార్థ్, శ్రీరాధా, నాజర్, సుమన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'రామజన్మభూమి'. స్వీయ నిర్మాణ సంస్థ సముద్ర మూవీస్ పతాకంపై సముద్ర రూపొందిస్తున్నారు. శుక్రవారం ఈ చిత్ర టీజర్‌ను సీనియర్ నటుడు మురళీమోహన్ ఆవిష్కరించారు. 'శ్రీరాముడు దేశానికి రాజుగా, ఒక తండ్రికి మంచి బిడ్డగా, తమ్ముళ్లకు అన్నగా ధర్మబద్ధంగా బ్రతికాడు. అలా ప్రతి పౌరుడు రాముడిలా బ్రతకాలి. యువత రాజకీయాల్లోకి వచ్చి సమాజాన్ని సంస్కరించాలనే సందేశంతో ఈ సినిమాను తెరకెక్కించాం' అని దర్శకనిర్మాత వి.సముద్ర తెలిపారు. నేటి సమాజానికి స్ఫూర్తినిచ్చే చిత్రమిదని హీరో జై సిద్ధార్థ్ అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: రవిశంకర్, నిర్మాత, దర్శకత్వం: వి.సముద్ర.



కాంద్రకోట రహస్యం

వరుణ్‌సందేశ్ నటిస్తున్న తాజా చిత్రం 'నింద'. 'కాంద్రకోట మిస్టరీ' ఉపశీర్షిక. స్వీయ నిర్మాణ దర్శకత్వంలో రాజేష్ జగన్నాథం రూపొందిస్తున్నారు. శుక్రవారం కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో వరుణ్‌సందేశ్ అమాయకంగా కనిపిస్తున్నాడు. దర్శకుడు మాట్లాడుతూ 'విభిన్న కథాంశంతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం. కాంద్రకోట అనే ప్రదేశంలో చోటుచేసుకునే అనూహ్య సంఘటనలు, వాటివెనకున్న శక్తుల రహస్యాలు ఆద్యంతం ఉత్కంఠను పంచుతాయి. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ నెల 15న టీజర్‌ను విడుదల చేయబోతున్నాం' అన్నారు. అనీ, తనికెళ్ల భరణి, భద్రం, సూర్యకుమార్, ఛత్రపతి శేఖర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: రమీజ్ నవీత్, సంగీతం: సంతు ఓంకార్, రచన-దర్శకత్వం: రాజేష్ జగన్నాథం.

మిస్టర్ ఇడియట్ టీజింగ్..

రవితేజ తమ్ముడి కుమారుడు మాధవ్ హీరోగా నటించిన చిత్రం 'మిస్టర్ ఇడియట్'. సిమ్రాన్‌శర్మ కథానాయిక. 'పెళ్లిసందడి'ఫేం గౌరి రోణంకి దర్శకత్వంలో జె.జె.ఆర్.రవిచంద్ ఈ చిత్రాన్ని నిర్మించారు. నిర్మాణం పూర్తి చేసుకున్న ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది. ఈ సినిమా టీజర్‌ను హీరో రవితేజ తన సోషల్‌మీడియా ద్వారా విడుదల చేశారు. ఫ్యాషన్ డిజైనింగ్ కాలేజ్ నేపథ్యంలో హీరోహీరోయిన్ల మధ్య సాగే ఫన్ అండ్ క్యూట్ లవ్‌స్టోరీగా ఈ సినిమా తెరకెక్కిన్నట్టు టీజర్ చెబుతున్నది. త్వరలోనే ఈ సినిమా విడుదల తేదీని ప్రకటిస్తామని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: రామ్, సంగీతం: అనూప్ రూబెన్స్, సమర్పణ: యలమంచి రాణి, నిర్మాణం: జేజేఆర్ ఎంటర్టైన్‌మెంట్స్.

అన్నాచెల్లెళ్ల అనుబంధం

రామ్, పవిత్ర, కస్వి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'చిట్టి పొట్టి'. స్వీయ దర్శకత్వంలో భాస్కర్ యాదవ్ దాసరి నిర్మిస్తున్నారు. త్వరలో ప్రేక్షకుల ముందుకురానుంది. 'అన్నచెల్లెలి అనుబంధం ప్రధానంగా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నాం. మూడు తరాల్లో చెల్లెలుగా, మేనత్తగా, బామ్మగా ఒక ఆడబిడ్డకు పుట్టింటిపై ఉన్న ప్రేమ, మమకారాన్ని తెలిపే చిత్రమిది. కుటుంబ భావోద్వేగాలతో ప్రతి ఒక్కరిని ఆకట్టుకుంటుంది. ఇటీవల విడుదల చేసిన టైటిల్, మోషన్ పోస్టర్‌కు మంచి స్పందన లభించింది' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: మల్లర్‌భట్ జోషి, సంగీతం: శ్రీవెంకట్, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం, నిర్మాత: భాస్కర్ యాదవ్ దాసరి.

డార్లింగ్ హంగామా

ప్రియదర్శి, నభానటేష్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'డార్లింగ్'. 'పైడిస్ కొలవెలె' ఉపశీర్షిక. అశ్విన్‌రామ్ దర్శకత్వం వహిస్తున్నారు. ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై కె.నిరంజన్ రెడ్డి నిర్మిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ పూర్తయింది. 'రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిస్తున్నాం. ఆద్యంతం చక్కటి వినోదంతో ఆకట్టుకుంటుంది. ప్రియదర్శి, నభానటేష్ పాత్రలు నవ్యలీతిలో సాగుతాయి. ఇటీవలే విడుదలైన ప్రచార చిత్రాలకు మంచి స్పందన లభిస్తున్నది' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: నరేష్, సంగీతం: వివేక్‌సాగర్, దర్శకత్వం: అశ్విన్‌రామ్.